సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 12 । జనవరి । 2023



నిర్వాసితులకు పట్టాల పంపిణీ

ఇందుకూరుపేటలో పోలవరం నిర్వాసితులకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పట్టాలు అందజేశారు.



ఐక్యవేదిక నేతలతో డీడీ చర్చలు 8లో



విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు 8లో

## న్యూస్‌రీల్

### స్టడీ టూర్‌లో అరకు ఎంపీ మాధవి



సదస్సులో పాల్గొన్న ఎంపీ మాధవి

**కొయ్యూరు:** షెడ్యూల్ కులాలు, తెగలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన సంక్షేమ కమిటీ స్టడీ టూర్‌లో అరకు ఎంపీ గొడేటి మాధవి బుధవారం పాల్గొన్నారు. దీనిని గోవా రాజధాని పనాజీలో నిర్వహించారు. మూడు రోజుల పాటు సంక్షేమానికి తీసుకోవలసిన అంశాలపై చర్చిస్తారని ఎంపీ తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా, ఎస్టీ,ఎస్సీలను ప్రగతిపథంలో నడిపించేందుకు వీలుగా పలు సిఫార్సులు చేస్తారని ఎంపీ తెలిపారు.

### పిట్టచలం సమీపంలో మరో పెట్రోల్ బంక్

**కొయ్యూరు:** ఎం మాకవరం పంచాయతీ పిట్టచలం సమీపంలో మరో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదేప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరంలో కాకరపాడు వద్ద హెచ్‌పీసీఎల్ బంక్‌ను జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నిర్మాణ దశలో ఉన్న జాతీయ రహదారి పక్కనే మరో బంక్‌ను ఏర్పాటు చేస్తారు. పాడేరు ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్ స్థలానికి సంబంధించిన వివరాలను బుధవారం తహసీల్దార్ తిరుమలరావుతో మాట్లాడారు.అక్కడ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని హెచ్‌పీసీఎల్ అధికారులకు రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఈ మేరకు ఆదేశాలు ఇచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు.

### ఘాటెక్కిన అల్లం ధర

కిలో రూ.110



మార్కెట్‌కు తీసుకువచ్చిన అల్లం

**ముంచంగిపుట్టు:** మండలంలో అల్లం ధర ఘాటెక్కింది. ప్రస్తుతం వారపు సంతల్లో అల్లం ఆశించిన స్థాయిలో రాకపోవడం డిమాండ్ నెలకొంది.దీనిని అదునుగా తీసుకొని వ్యాపారులు అల్లం ధరను అమాంతం పెంచేశారు. నెల రోజుల వ్యవధిలోనే ధర పెరుగుదలలో చాలా వ్యత్యాసం కనిపించింది.గత నెల కిలో అల్లం రూ.70 ఉంటే ప్రస్తుతం కిలో రూ.90 నుంచి రూ.110కు చేరింది. అల్లం దిగుబడి ఈ ఏడాది తగ్గడంమే ధర పెరుగుదలకు కారణమని వ్యాపారులు తెలిపారు.

### ఆస్పత్రిలో ప్రసవాలపై అవగాహన కల్పించండి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్‌బాషా



మందులు నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

**దుంబ్రిగుడ:** ఆస్పత్రిల్లో ప్రసవాలపై గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు నిల్వలు, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాతాశిశు మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కాన్పుకు సిద్ధంగా ఉన్న గర్భిణులను గుర్తించి, ఆస్పత్రిలోని ప్రసవించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని వైద్యాధికారులు ప్రేమ,రాంబాబు, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి సింహాద్రి, జిల్లా టీబీ అధికారి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### తామర పురుగుతో మిర్చిపంట నాశనం

- మనోవేదనతో రైతు హఠాన్మరణం
- నందిగామలో విషాదం

8లో



నాగయ్య (ఫైల్)

# ప్రగతికి బాటలు

**బొర్రా పంచాయతీ ఆదాయం మెరుగుకు అధికారుల సహకారంతో పాలకవర్గం బాటలు వేసుకుంటోంది. ఉన్న వనరులన్నింటిని సద్వినియోగం చేసుకుంటోంది. దీనిలో భాగంగా బొర్రా గుహల ప్రాంతంలో పార్కింగ్‌ను క్రమబద్ధీకరించింది.** ఇందుకు ఐదు చోట్ల స్థలం కేటాయించింది. పార్కింగ్ రుసుం ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వెచ్చించేలా కార్యాచరణ రూపొందించింది.

- ఆదాయం మెరుగుకు బొర్రా పంచాయతీ కసరత్తు
- ఐదు చోట్ల వాహనాల పార్కింగ్
- వసూలైన రుసుం అభివృద్ధికి కేటాయింపు
- ఎంపీడీవో, సర్పంచ్ ఉమ్మడి ఖాతాలో జమకు కార్యాచరణ



గేటువలస సమీపంలో ఏర్పాటుచేసిన కారు పార్కింగ్

పార్కింగ్ రుసుం

| | |
|---|---|
| ద్విచక్ర వాహనం | రూ.10 |
| ఆటో | రూ.20 |
| కార్లు, జీపులు | రూ.30 |
| బస్సు | రూ.50 |



కొనుగోలుచేసిన ఈపోస్ యంత్రం

**అనంతగిరి:** మన్యంలోని పర్యాటక ప్రాంతాల్లో బొర్రాగుహలకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. సహజసిద్ధంగా ఏర్పడిన గుహల అందాలను తిలకించేందుకు ఏటా లక్షల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారు. కార్తీకమాసం సీజన్ ప్రారంభం నుంచి మన్యం అందాలతో పాటుగా గుహల అందాలను తిలకించేందుకు భారీగా వాహనాల్లో తరలివస్తుంటారు. దసరా, సంక్రాంతి, క్రిస్మస్ పండగల సెలవుల్లో అయితే చెప్పనవసరం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాలు, బస్సుల్లో వస్తుంటారు. గుహలు వద్ద పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో పర్యాటకులు తీసుకువచ్చే, బస్సులు, కార్లు, రోడ్డుమీద పార్కింగ్ చేయడం వల్ల పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని, సమస్య పరిష్కారంపై ఎంపీడీవో శ్రీహర్షిత్, సర్పంచ్ అప్పారావు దృష్టి సారించారు. పంచాయతీ ఆధ్వర్యంలోని ఇన్‌చార్జి కార్యదర్శి గోపాలకృష్ణ, ప్రస్తుత కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి చొరవతో పార్కింగ్ సదుపాయం కల్పించారు.

**ఐదు ప్రదేశాల్లో పార్కింగ్ సౌకర్యం**

బొర్రాగుహలు సమీపంలోని ఒకటి, హోటళ్ల వద్ద మరొకటి, గేటువలస సమీపంలోని మూడు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. గేటువలస సమీపంలోని బస్సులు, మినీ బస్సులను పార్కింగ్ చేయిస్తున్నారు. కార్లను బొర్రాగుహల సమీపంలో పార్కింగ్ కల్పిస్తున్నారు.

**పారిశుధ్యం, పంచాయతీ అభివృద్ధికి..**

వాహనాల పార్కింగ్‌తో వచ్చే ఆదాయంతో పారిశుధ్యం మెరుగుకు, పంచాయతీ అభివృద్ధి పనులకు వెచ్చించేలా ప్రణాళికలు రూపొందించారు. పార్కింగ్ ప్రదేశంలోని వాహనాల నుంచి రుసుం వసూలు చేస్తున్నారు. పార్కింగ్ ఆదాయాన్ని ఎంపీడీవో, సర్పంచ్ ఉమ్మడి ఖాతాలో జమ చేస్తున్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో పార్కింగ్ టికెట్లు విక్రయించేలా ఈపోస్ యంత్రాన్ని పంచాయతీ కొనుగోలు పంచాయతీ కొనుగోలు చేసింది. పార్కింగ్ వాహనాల నుంచి టికెట్ల రూపంలో రుసుం వసూలుకు 15 మంది గిరిజన నిరుద్యోగులను నియమించారు. వీరందరికీ ఉపాధి అందుబాటులోకి వచ్చింది. ఈసందర్భంగా బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు మాట్లాడుతూ పార్కింగ్ సమస్యను ఎంపీడీవో ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన సహకారంతో పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. దీనివల్ల బొర్రాకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తప్పాయని ఆయన పేర్కొన్నారు.

**ఆన్‌లైన్‌లో పార్కింగ్ రుసుం వసూలు**



గుహల అందాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై దృష్టిసారించి, పార్కింగ్ సదుపాయం కల్పించాం. ఆన్‌లైన్‌లో వాహన టికెట్లు విక్రయించేలా ఈనోస్ యంత్రాన్ని కొనుగోలు చేశాం. త్వరలో ఆన్‌లైన్ ద్వారా పార్కింగ్ రుసుం వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం.

–శ్రీహర్షిత్, ఎంపీడీవో, అనంతగిరి

## కాలువల ఆక్రమణపై చర్యలు

- డీపీవో కొండలరావు
- విచారణ ప్రారంభం



తహసీల్దార్ తదితర అధికారులతో మాట్లాడుతున్న డీపీవో కొండలరావు

**రాజవొమ్మంగి:** రాజవొమ్మంగి నడిబొడ్డు నుంచి ప్రవహించే ఇరిగేషన్ / రెవెన్యూ కాలువల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని డీపీవో కొండలరావు తెలిపారు. కాలువలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజల నుంచి స్పందనలో ఫిర్యాదులు అందాయి. దీనిపై కలెక్టర్, సబ్ కలెక్టర్ స్పందించారు. వారి ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారితో కలిసి ఆయన విచారణ చేపట్టారు. సర్వే నంబర్లు 23, 27, 28, 35, 37, 40ల్లో ఆక్రమణలపై దృష్టి సారించామని చెప్పారు. ఈ కాలువ పొడవు, వెడల్పు తదితర కొలతలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తమకు అందజేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి, మరోసారి ప్రభుత్వ భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపడతామని డీపీవో తెలిపారు.

**30 శాతం మేర ఇంటిపన్నుల వసూలు**

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇళ్ల పన్నుల డిమాండ్ రూ.8,60,23,749 కాగా ఇప్పటి వరకు 30శాతం మేర, అంటే రూ. 2,58,09,227 వసూలు చేసినట్టు డీపీవో కొండలరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పన్నుల వసూళ్ల బాధ్యత పూర్తిగా పంచాయతీ కార్యదర్శులదే అన్నారు. పంచాయతీల్లో వసూలైన ఇళ్ల పన్నుల్లో 15 శాతం విద్యుత్ దీపాలు, 15శాతం పారిశుధ్యం, 15 శాతం తాగునీటికి పంచాయతీలో ఉపయోగించుకోవచ్చునని సూచించామని తెలిపారు. వసూలైన మొత్తంలో 30 శాతం వరకు పారిశుధ్య సిబ్బంది జీతాల కోసం వినియోగించుకోవచ్చన్నారు. అత్యవసరమైతే 50 శాతం వరకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. అనంతరం మండల పరిషత్‌లో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఇంటిపన్నుల వసూలు వేగవంతం చేయాలని ఆదేశించారు. డీఎల్పీవో, అడ్డతీగల ఎంపీడీవో వివేక్, ఈవోపీఆర్డీ వెంకటశ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గండిపోశమ్మ ఆలయ సందర్శన

ఆలయ పరిరక్షణ చర్యలపై దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ సమీక్ష



ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎమ్మెల్యే ధనలక్ష్మికి వివరిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్

**దేవీపట్నం:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న గండిపోశమ్మ అమ్మవారి స్వయంభువు ఆలయాన్ని పరిరక్షించే నిర్మాణానికి సంబంధించి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. అనంతరం శరభవరంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిని కలసి అమ్మవారి స్వయంభువు ఆలయ పరిరక్షణకు చేపడుతున్న పనులపై చర్చించారు. నిర్మాణానికి సంబంధించి తక్షణం మట్టి పరీక్షలు నిర్వహించాల్సి ఉందని అన్నారు. ఆలయ ఈవో లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న తోడులో 4,349 మందికి లబ్ధి

- రూ.8.25 లక్షలు చెక్కు రూపంలో పంపిణీ
- సద్వినియోగం చేసుకోవాలి: రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు



జగనన్న తోడు చెక్కును అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్

**పాడేరు రూరల్:** జగనన్న తోడు ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ సూచించారు. బుధవారం జగనన్న తోడు ఆరవ విడత రుణాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవాడ నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. దీనిలో భాగంగా జిల్లాలో 4,349 మంది లబ్ధిదారులకు రూ.8.25లక్షల మేర లబ్ధి చేకూరింది. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వారు లబ్ధిదారులకు చెక్కు రూపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు మాట్లాడుతూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమా చేయడం జరిగిందన్నారు. అట్టడుగున ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లో అర్హత ఉండి జగనన్న తోడు అందకపోతే అధికారులను సంప్రదించి తిరిగి పొందవచ్చునని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. డీఆర్‌డీఏ పీడీ వి. మురళి, డీపీఎం ఎస్. వైకుంఠరావు, ఏరియా కోఆర్డినేటర్ కృష్ణారావు, ఏపీఎంలు పాల్గొన్నారు.

## లంబసింగి అందాలు అమోఘం

- అందుకే మళ్లీ వచ్చా..
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- కుటుంబ సమేతంగా లంబసింగి సందర్శన



లంబసింగిలో స్ట్రాబెర్రీ పంటను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్



మంత్రి అమర్‌నాథ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

**చింతపల్లి రూరల్:** లంబసింగిలో ప్రకృతి అందాలు అమోఘమని ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం ఆయన ఆంధ్రా కశ్మీర్ లంబసింగి అందాలను తిలకించేందుకు కుటుంబ సమేతంగా విచ్చేశారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆయనకు శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం గిరిజనులు సాగు చేస్తున్న స్ట్రాబెర్రీ తోటలను ఆయన సందర్శించారు. వారి నుంచి సాగు విధానం, ఆదాయం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చింతపల్లి ప్రాంతానికి వచ్చానని, ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లు, కాఫీ తోటల అందాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. పర్యాటకులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న ఎకో టూరిజం రిసార్ట్స్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు, ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు,ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపీడీవో లాలం సీతయ్య, సర్పంచ్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



కామయ్యపేటలో మంట కాగుతున్న గిరిజనులు



పాడేరులో కురుస్తున్న మంచు

**సాక్షి, పాడేరు:** జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలోని 4.8 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 8 డిగ్రీలు, అరకులోయలో 8.6 డిగ్రీలు ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. చలిగాలులు విజృంభిస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

**హుకుంపేట:** మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి, చలితీవ్రతకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మంచు గడ్డలు కడుతోంది. చలితీవ్రతకు తాళలేకపోతున్న గిరిజనులు చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. ఉదయం 11 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు.

## గ్రామ సచివాలయంలో తొలి కారుణ్య నియామకం

ఆర్డరు అందజేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్



నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**సాక్షి, పాడేరు:** గ్రామ సచివాలయ వ్యవస్థలో జిల్లాకు సంబంధించి తొలి కారుణ్య నియామకం జరిగింది. జి.మాడుగుల మండలం గెమ్మెలి గ్రామ సచివాలయంలో విలేజ్ సర్వేయర్‌గా పనిచేస్తున్న బాడం కేశన్నదొర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి భార్యకు కారుణ్య నియాకమం కోసం గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో అతడి భార్య బాడం నారాయణమ్మకు పాడేరు మండలం వనుగుపల్లిలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శిగా నియమిస్తూ కలెక్టర్ బుధవారం నియామక పత్రం అందజేశారు. కారుణ్య నియామకం పొందిన బాడం నారాయణమ్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడులకే నానిపాత్రుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జెలి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు పూజారి సత్యవతి, కోశాధికారి పాంగి రవికుమార్ పాల్గొన్నారు.

## పోలీసుల సమ్మేళనాలను బహిష్కరించండి

మావోయిస్టు డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ



మావోయిస్టు పార్టీ విడుదల చేసిన ప్రకటన

**జి.మాడుగుల:** పోలీసులు నిర్వహించింది ఆత్మీయ సమ్మేళనం కాదు..! ఆత్మలను అమ్ముకోమనే సమ్మేళనమని వాటిని బహిష్కరించాలని సీపీఐ (మావోయిస్టు)పార్టీ విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈమేరకు మావోయిస్టు పార్టీ నుంచి స్థానిక విలేకరులకు బుధవారం ప్రకటన అందింది.అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నాయకత్వంలో ఈ మధ్య లొంగిపోయిన మావోయిస్టులతో ఆత్మీయ సమ్మేళనం జరిగిందని, ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశం లొంగిపోయిన వారికి విప్లవ ద్రోహులుగా, ప్రజావ్యతిరేకులుగా పోలీసు ఏజెంట్లుగా తయారు చేసే లక్ష్యంతో వారిపై ఒత్తిడి తెచ్చిన కార్యక్రమమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మేళనానికి వచ్చిన వారిలో కొందరు విప్లవ ద్రోహులున్నారని వారిపై ఆధారపడి సాధారణ జీవితం గడుపుతున్న సంఘ సభ్యులు మావోయిస్టు పార్టీ సమాచారం ఇవ్వాలని పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. సుధీర్, శ్రీకాంత్ లాంటి విప్లవ ద్రోహులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. సాధారణ జీవితం గడపాలనుకుంటే పోలీసులతోను, విప్లవద్రోహులతో ఎలాంటి సంబంధాలు కలిగి ఉండకుండా నిజాయతీగా బతకాలని మావోయిస్టు నేత అరుణ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

## చింతపల్లి మార్కెట్‌కు సంక్రాంతి శోభ



చింతపల్లి సంతలో నూతన వస్త్రాలు కొంటున్న గిరిజనులు

**చింతపల్లి:** సంక్రాంతి పండగ నేపథ్యంలో మండల కేంద్రంలో బుధవారం జరిగిన వారపుసంత గిరిజనులతో కిటకిటలాడింది. సంక్రాంతికి ముందు జరుగుతున్న వారపు సంత కావడంతో పలు ప్రాంతాల నుంచి గిరిజనులు భారీగా తరలివచ్చారు. దీంతో రహదారులు కిక్కిరిసి పోయాయి. వస్త్ర దుకాణాల వద్ద గిరిజనులు బారులు తీరారు. అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చారు.



గిరిజనుల రాకతో కిక్కిరిసిన పోయిన సంత ప్రాంగణం

## పించన్ల సొమ్ము దుర్వినియోగం

- రూ.2.5 లక్షలు రికవరీకి పీడీ రమేష్‌రామన్ ఆదేశం
- వై.రామవరంలో ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక



వై.రామవరంలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

**వై.రామవరం:** మండలంలోని వివిధ పంచాయతీల్లో దుర్వినియోగమైన రూ.2.5 లక్షలు రికవరీకి డ్వామా పీడీ రమేష్ రామన్ ఆదేశించారు. 17 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో 2020–21, 2021–22లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి ప్రజావేదిక నిర్వహించారు. ఆయా సంవత్సరాల్లో 3,868 పనులు రూ.25,08,55,737తో చేపట్టారు. వీటికి సంబంధించి 15 రోజులుగా గ్రామాల్లో విలేజ్ సోషల్ ఆడిటర్లు, డీఆర్పీల ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో అశోక్‌కుమార్ అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా డ్వామా పీడీ రమేష్‌రామన్ రూ.2.5 లక్షల పించన్ల సొమ్ము దుర్వినియోగం అయిందన్న ఆరోపణల మేరకు విచారించారు. రికవరీకి ఆదేశించారు. సామాజిక తనిఖీలపై అభ్యంతరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.17 వేల రికవరీకి పీడీ ఆదేశించారు.కె. యర్రగొండ పంచాయతీలో రూ.1.4 లక్షల చేపట్టిన సర్వశిక్షా అభియాన్ పనులకు సంబంధించి రికార్డులు సమర్పించలేదని, వెంటనే అందజేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్‌లు పల్లాల బాలురెడ్డి, ముత్యాల నూకరాజు, డ్వామ ఏపీడీ సీహెచ్ చిట్టిబాబు, ఎస్ఆర్‌పీ సింహాద్రి, ఏపీవో ప్రకాశ్‌బాబు, మారేడుమిల్లి ఏపీవో రెడ్డిబాబు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన శివశంకర్

**పాడేరు రూరల్:** ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొన్న సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బుధవారం మండలంలోని మినుములూరు కాఫీ లైజన్ ఆఫీస్‌కు వెళ్లి స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకొని తిరిగి పాడేరు వస్తున్న క్రమంలో పట్టణ శివారు సుండ్రుపుట్టు పెట్రోల్ బంకు ఎదురుగా రహదారిపై ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు మరో ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని సమీపంలో ఉన్న జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్య చికిత్సలు కల్పించారు. వీరిలో డిగ్రీ కళాశాల విద్యార్థి శివశంకర్‌తో పాటు మరో ద్విచక్ర వాహనదారుడి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

### జాతీయ యువజనోత్సవాల ప్రత్యక్ష ప్రసారం

**తుమ్మపాల:** స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి 16 వరకు జాతీయ యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సెట్విన్ సీఈవో పి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ కర్ణాటకలో ఈ ఉత్సవాలను గురువారం సాయంత్రం ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమాన్ని పీఎం.ఇండియా.వెబ్‌కాస్ట్.ఇన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించడానికి జిల్లాలోని అన్ని యూత్ క్లబ్‌లు, యువజన సంఘాలు, విద్యా సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారు.

# విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు


చింతపల్లి పాఠశాలలోని సంబరాల్లో పాల్గొన్న ఎంపీపీ అనూషాదేవి


రంపచోడవరంలోని వేడుకలో సంప్రదాయ దుస్తుల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**చింతపల్లిరూరల్:** సంక్రాంతి పండగకు పల్లెలన్నీ ముస్తాబయ్యాయి. గ్రామాలన్నీ బంధు, మిత్రులతో కళకళలాడుతున్నాయి. విద్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో స్వగ్రామాలకు విద్యార్థులు తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు విద్యాలయాల్లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో భోగి మంట వేసి, ఆనందోత్సవాల మధ్య సంక్రాంతి వేడుకలకు స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు చేశారు. వార్డెన్ నూకరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఆస్పత్రిలో వేడుకలు**

**కొయ్యూరు:** రాజేంద్రపాలెం ఆస్పత్రిలో వైద్య సిబ్బంది సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆస్పత్రి ఆవరణలో అందమైన ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ పండగను ఆనందంగా జరుపుకోవాలని వైద్యులు చెప్పారు.

**కాలేజీలో రక్తదాన శిబిరం**

**రంపచోడవరం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడు, వైస్ ప్రిన్సిపాల్ డి.రవికుమార్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. అధ్యాపకులు, సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు సంబరాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ(కాకినాడ) సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 27 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవికుమార్ రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వై.డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

**గంగవరం:** దతమామిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం గురవయ్య ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. బాల బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి, సాంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు కె.కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని గిరిజన యువతి మౌనదీక్ష


టేకులబోరులో మౌనదీక్ష చేపట్టిన రాములమ్మ

**కూనవరం:** ఏఎన్ఎం ఉద్యోగం ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి తన వద్ద నుంచి 2019లో రూ.లక్ష తీసుకొని ఇదిగో ఉద్యోగం అదిగో ఉద్యోగం అంటూ మోసం చేసిన ఆర్ఎంపీ వైద్యుడు ముత్యాల శ్రీనుపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదని బండారుగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతి పాయం రాములమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మౌనదీక్ష చేపట్టింది. ఆమె దీక్షకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, నాట్‌వాన్ సంఘం మహిళలు, న్యాయవాది రవివర్మ, బీజేపీ, టీడీపీ నాయకులు పూర్తి మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు స్పందించి బాధితురాలి తరపున పెద్దలను చర్చలకు పిలిచారు. ఈ చర్చల్లో ఆర్ఎంపీపై మరికొన్ని ఫిర్యాదులు రావడంతో ఎస్ఐ కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారని, దీంతో మౌనదీక్ష విరమించినట్టు బాధితురాలు తెలిపింది. న్యాయవాది రవివర్మ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు. కాగా ఈ విషయమై ఎస్ఐ బి.వెంకటేష్‌ను వివరణ కోరగా ఈ రోజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకయ్య, కుంజా అనిల్, సోడె వెంకమ్మ, పొడియం అప్పారావు, కారం దారయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొరాయించిన ఆర్టీసీ బస్సు


వనభసింగి వద్ద నిలిచిపోయిన అనకాపల్లి డిపో బస్సు

**ముంచంగిపుట్టు:** జోలాపుట్టు నుంచి అరకులోయ వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం వనభసింగి పంచాయతీ కేంద్రం సమీపంలో మరమ్మతుకు గురై మార్గమధ్యలో నిలిచిపోయింది.దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనకాపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు అనకాపల్లి నుంచి ముంచంగిపుట్టు మండల కేంద్రం మీదగా జోలాపుట్టు వెళ్లి తిరిగి ప్రయాణంలో అరకులోయ వెళ్తుండగా బస్సు సాంకేతిక సమస్య తలెత్తడంతో వనభసింగి వద్ద డ్రైవర్ బస్సును నిలపివేశాడు. దీంతో ప్రయాణికులు గంట వరకు అక్కడే పడిగాపులు కాశారు. కొంత సమయం తర్వాత మరో బస్సులో కండక్టర్ ప్రయాణికులను పంపించారు. కండిషన్‌లో లేని బస్సులను గిరిజన ప్రాంతంలో నడపడం వల్ల తరచూ నిలిచిపోతున్నాయని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి, పూర్తిగా కండిషన్‌లో ఉన్న బస్సులను ఏజెన్సీలో నడపాలని కోరుతున్నారు. బస్సు మరమ్మతులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్రైవర్,కండక్టర్ ఇబ్బందులు పడుతూ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

# తామర పురుగుతో మిర్చి పంట నాశనం

- మనో వేదనతో రైతు హఠాన్మరణం


నాగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

**ఎటపాక:** కాయకష్టం చేసి సాగు చేసిన తోటలు కళ్లెదుటే మాడిపోతుంటే రైతన్నలు తల్లడిల్లుతున్నారు. ఈ ఏడాది కూడా చేతి కందిన పంట చేజారిపోతుందే అనే దిగులుతో తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో హైబీపీకి గురై మెదడులో నరాలు చిట్లి నందిగామ గ్రామానికి చెందిన యాలం నాగయ్య(61) అనే రైతు మంగళవారం రాత్రి మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..నాగయ్య గత ఏడాది ఎనిమిది ఎకరాల కౌలు భూమిలో మిర్చి సాగు చేశాడు. అయితే తామరపురుగు, ఎర్రనల్లి మిర్చి తోటలను ఆశించడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపి నష్టాల పాలయ్యాడు. సుమారు రూ.15 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. అయితే గోదావరి వరదలు రావడంతో పొలాలు నీటమునిగి ఒండ్రుమట్టి వేయడంతో ఈ ఏడాది చీడపీడలు రావని అంతా భావించారు. చేసిన అప్పులు తీర్చాలంటే మరలా మిర్చి సాగే శరణ్యమని భావించి అదే ఎనిమిది ఎకరాల్లో మిర్చి సాగు చేసాడు నాగయ్య. తొలుత తోటలు ఆశాజనకంగానే ఉన్నా డిసెంబర్ చివరిలో తామరపురుగు, ఎర్రనల్లి, ఇతర చీడపీడలు ఆశించాయి. దీంతో మరలా మిర్చి తోటలు పాడవడంతో పొలాన్ని చూసి తల్లడిల్లిన నాగయ్య సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చి పరిస్థితిని తన భార్యకు వివరించాడు. ఈఏడాది మనం కోలుకోలేమంటూ తీవ్ర భావోద్వేగానికి లోనై బాత్‌రూంలోకి వెళ్లాడు. అక్కడ హైబీపీకి గురై అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన భద్రాచలం ఆస్పత్రికి తరలించగా నాగయ్యను పరీక్షించిన వైద్యులు మెదడులో నరాలు చిట్లాయని ఫలితం లేదని చెప్పడంతో నందిగామ గ్రామం తీసుకురాగా మంగళవారం రాత్రి మృతి చెందాడు. నాగయ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు. ఆయన మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇతడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా వీరికి వివాహమైంది.

## ఐక్యవేదిక నేతలతో డీడీ చర్చలు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ

**పాడేరు రూరల్:** స్థానిక ఐటీడీఏ ఎదుట గత 24 రోజులుగా రిలే నిరహార దీక్షలు చేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులతో బుధవారం గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు చర్చలు జరిపారు. 13 డిమాండ్లపై ఇరువర్గాలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రజా సంఘాల నాయకులతో చర్చించిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని డీడీ హామీ ఇచ్చారని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కూడా రాధకృష్ణ తెలిపారు. సమస్యలపై స్పష్టమైన లిఖిత పూర్వక హామీ ఇచ్చిన తరువాతనే రిలే దీక్షలు విరమిస్తామని కూడా రాధకృష్ణ తెలిపారు. సమస్యలపై సానుకూలంగా స్పందన రాకపోతే తమ ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రాధకృష్ణ స్పష్టం చేశారు. ఈ చర్చల్లో గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షకులు శ్రీనివాస రెడ్డి, ప్రజా సంఘాల ఐక్యవేధిన నాయకులు ప్రభుదాస్, చిన్నారావు, నరేష్, లతకుమారి, ఆదివాసీ అడ్వకేట్ నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి


వంశీకృష్ణ (ఫైల్)

**రాజవొమ్మంగి:** తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన ఓ గిరిజన యువకుడు ఇంటి వద్దనే పొలాలకు ఉపయోగించే గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆస్పత్రికి తరలించేలోగానే మంగళవారం రాత్రి మరణించాడు. స్థానిక ఎస్ఐ గోపీ నరేంద్రప్రసాద్ కథనం మేరకు మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కుంజం వంశీకృష్ణ (22) 10వ తేదీ రాత్రి ఏడు గంటలకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని కుటుంబీకులు వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు అతనిని అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రి ఆసుపత్రికి తరలిస్తుండగా రాత్రి 10-30 గంటలకు పరిస్థితి విషమించి వంశీకృష్ణ మార్గమధ్యంలోనే మరణించాడు. వంశీకృష్ణ ఏజీ బీఎస్సీ చదివాడు. ప్రస్తుతం ఖాళీగా వుండడంతో ఉద్యోగం సద్యోగం లేకుండా ఆవారాగా తిరుగుతున్నావని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి వంశీ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

### 14న సింహగిరిపై సంక్రాంతి సంబరాలు

**సింహాచలం:** సింహగిరిపై ఈనెల 14న సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆరోజు ఉదయం రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున భోగి మంటను వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జగం దేవర, కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిలగిత్త, ఎడ్లబండి, పూరిళ్లు, కుండల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆ రోజు 9 గంటలకు చిన్న పిల్లలకు భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఆసక్తిగల తల్లిదండ్రులు తమపిల్లలను సింహగిరిపై ఉన్న నృసింహమండపానికి తీసుకురావాలన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సింహగిరిపై రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో 13వ తేదీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు లేదా 14వ తేదీ ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ముగ్గులు వేయాల్సి ఉంటుందన్నారు. 16వ తేదీ కనుమ రోజున శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 9 గంటలకు గోపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

# శేషతల్ప వాహనంపై సర్వాంతర్యామి

ఉపమాకలో ఘనంగా తిరువీధి సేవలు


వైకుంఠవాసునిగా దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి


పుష్పతోటలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

**నక్కపల్లి:** ప్రాచీనపుణ్యక్షేత్రం ఉపమాకలో ధనుర్మాస అధ్యయనోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి బుధవారం నిత్యార్చనలు అభిషేకాలు జరిపారు. దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో ఉత్సవమూర్తులకు నిత్యకార్యక్రమాలు నిర్వహించారు. భూదేవీ, శ్రీదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారిని శేషతల్పవాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలోను ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి నీరాట్టోత్సవాల్లో భాగాంగా స్వామివారి పుష్పతోటలో అమ్మవారికి పూజలు జరిపారు. ధూపదీప నైవేద్యాలు, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం గోదాదేవీ అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 27వ పాశురాన్ని విన్నపం చేశారు. రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా పదోరోజు బుధవారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని వైకుంఠవాసునిగా అలంకరించారు. పుణ్యకోటి వాహనంలో అధిష్ఠింపజేసి స్వామి వారి వాహనం ఎదురుగా నమ్మాళ్వార్, రామానుజుల వారి ఉత్సవమూర్తులను శేషతల్పవాహనంపై అధిష్ఠింపజేసి తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీనమ్మాళ్వార్ వా రి పరమపద ఉత్సవ కార్యక్రమం, నారాయణ సేవాకాలం తదితర కార్యక్రమాలు నిర్వహించా రు. అనంతరం ప్రత్యేక ప్రసాదం నివేదన, తీర్థగోష్ఠి జరిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు.

# రంగురాళ్ల తవ్వకాలపై డేగ కన్ను

- బేస్ క్యాంపులు, స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పర్యవేక్షణ
- చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు


ఆరిల్లోవ రంగురాళ్ల క్వారీ వద్ద ఏర్పాటు చేసిన బేస్ క్యాంపు


కరక, ఆరిల్లోవ ప్రాంతంలో లభించే రంగురాళ్లు

**నర్సీపట్నం:** పండగల పేరుతో రంగురాళ్ల తవ్వకాలకు ఆస్కారం ఉండడంతో అటవీశాఖ ముందుగా అప్రమత్తమైంది. ఇప్పటికే తవ్వకాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘాకు చర్యలు తీసుకుంది. బేస్‌క్యాంపుల నిర్వహణ, నిత్యం పర్యవేక్షణకు స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. దీనిని అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. అత్యంత విలువైన వైఢూర్యాలు లభించే గొలుగొండ మండలం అటవీ ప్రాంతంపై ఇటీవల రంగురాళ్ల వ్యాపారుల కన్ను పడింది. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రెండు వారాల కిందట తవ్వకాలు సాగించారు. ఈ సంఘటనతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. కరక, సాలికమల్లవరం, ఆరిల్లోవ అటవీ ప్రాంతాల్లోని రంగురాళ్ల క్వారీల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన వారిపై ఇప్పటికే అటవీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు.

గొలుగొండ మండలంలో 1250 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. 2005లో కరక కొండపై రంగురాళ్ల తవ్వకాలు ముమ్మరంగా సాగేవి. అదే ఏడాది జనవరిలో కరక క్వారీ కూలి ఇద్దరు మృతి చెందగా...కొంత మంది గాయపడ్డారు. దీంతో క్వారీని మూయించి నిరంతరం గస్తీలో భాగంగా ఏర్పాటు చేసిన బేస్‌క్యాంప్ నేటికీ నడుస్తోంది. పక్కాగా పహారా ఉన్నా 2021 ఆగస్టు 20వ తేదీన కొందరు కరక కొండపై తవ్వకాలకు సిద్ధమయ్యారు. విషయం తెలియడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తవ్వకాలకు మాటువేసి ఉన్న ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా రంగురాళ్ల తవ్వకాలకు సహకరించిన వ్యక్తి డీఎఫ్‌వో వద్ద అవుట్‌సోరింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కారు డ్రైవర్ కావడంతో అధికారులు విస్తుపోయారు. దీంతో అటవీ అధికారులు క్వారీ ప్రాంతంలో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. క్వారీల్లో లభ్యమయ్యే అలెక్స్ రకం రంగురాళ్లకు గిరాకీ ఉంది. ఇవి నాణ్యమైన వజ్రాల మాదిరిగానే ఉంటాయి. కోట్ల రూపాయల్లో ధర పలుకుతాయి. ఇంతటి విలువ ఉన్నందునే స్మగ్లర్లు వీటికోసం తరచూ ప్రయత్నిస్తున్నారు. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అటవీ సిబ్బంది దాడులు నిర్వహించారు. సిబ్బందిపై రాళ్లు రువ్వి తవ్వకందారులు తప్పించుకున్నారు. రేంజర్ లక్ష్మీనర్సు లోతుగా విచారణ చేసి ఇద్దరు వ్యాపారులు పైల ప్రసాద్, పత్తి గోవింద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తవ్వకాలు జరిపించిన మేస్త్రీలు, కూలీలతో కలిపి 27 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎప్పుడూ కూలీలనే అరెస్టు చేసే అధికారులు ఈసారి వ్యాపారులను సైతం వదిలిపెట్టలేదు. ఈ తవ్వకాల వెనుక పత్రికా విలేకరులు, మరో ఇద్దరు బడా వ్యాపారుల హస్తం ఉండడంతో అటవీ అధికారులు ఆ దిశగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. క్వారీని పరిశీలించిన సీసీఎఫ్ శ్రీనాథరెడ్డి ఆదేశాల మేరకు క్వారీ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేసి నిఘా కట్టుదిట్టం చేశారు.

### భద్రత కట్టుదిట్టం...



ఆరిల్లోవ, కరక క్వారీపై మరింత నిఘా ఉంచుతున్నాం. రాత్రింబవళ్లు సిబ్బందిని నియమించాం. రిజర్వుర్డు ఫారెస్టులో ప్రవేశం నిషిద్ధం. అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించికూడదు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఆరిల్లోవ రంగురాళ్ల తవ్వకాల్లో ఇప్పటికే వ్యాపారులను అరెస్టు చేశాం. ఆరిల్లోవ ఘటనపై రేంజర్‌చే లోతుగా విచారణ చేయిస్తున్నాం. తవ్వకాల వెనుక ఎవరు ప్రమేయం ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. ఆ ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు తవ్వకాలకు పాల్పడితే ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను రద్దు చేస్తాం. చట్టాలను అతిక్రమిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తాం.

–బి.రాజారావు, డీఎఫ్‌వో, నర్సీపట్నం

## ఉపాధ్యాయులు, విద్యార్థుల ఔదార్యం


నీరజ్ తల్లిదండ్రులకు చెక్కును అందిస్తున్న హెచ్ఎం తదితరులు

**రావికమతం:** బోన్‌మ్యారో వ్యాధితో బాధపడుతున్న కొత్తకోట హైస్కూల్ పదో తరగతి విద్యార్థి గ(ర్రె)డ్డి నీరజ్ వైద్య ఖర్చుల నిమిత్తం కొత్తకోట హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉదారత చాటుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న నీరజ్ తల్లిదండ్రులకు బుధవారం రూ.74,672 సహాయాన్నందించారు. నీరజ్‌కు రక్తమార్పిడి చేయాల్సి ఉంది. దీనికి రూ.30 లక్షలు వరకూ ఖర్చవుతుంది. ఇటీవల నర్సీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిని నీరజ్ కలవగా ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును అందించారు. ఇప్పటి వరకూ అప్పులు చేసి వైద్యం చేయించుకున్న ఆ కుటుంబం ఆర్థికంగా చిదిగిపోవడంతో పలువురు దాతలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. కొత్తకోట హైస్కూల్ ఉపాధ్యాయ బృందం రూ.46,622, విద్యార్థులు రూ.28,050 మొత్తం రూ.74,672 హైస్కూల్ హెచ్ఎంల చేతుల మీదుగా బుధవారం అందించారు.

# నేటి నుంచి అరకు 'ఇన్‌స్టెంట్' ఘుమఘుమలు

- 50, 100 గ్రాముల టిన్స్‌లో లభ్యం
- ఈ నెలాఖరు నాటికి బ్లెండెడ్ సాచెట్స్


మార్కెట్‌లో విడుదలకు సిద్ధమైన ఇన్‌స్టంట్ కాఫీ టిన్స్

**సాక్షి, విశాఖపట్నం :** అంతర్జాతీయ కాఫీ మార్కెట్లో తనకంటూ ప్రత్యేకతను సంతరించుకున్న అరకు కాఫీ నుంచి ఇన్‌స్టంట్ కాఫీ ఘుమఘుమలు మూడేళ్ల విరామం తర్వాత మార్కెట్‌లో పలకరించనున్నాయి. తొలి విడతగా.. టిన్స్‌ని మార్కెట్‌లో గురువారం నుంచి విక్రయించేందుకు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఏర్పాట్లు చేసింది. మొత్తం మూడు రకాలుగా ఇన్‌స్టంట్ కాఫీ రుచులు వినియోగదారులకు పరిచయం చేస్తున్నట్టు జీసీసీ ఎండీ సురేష్ కుమార్ తెలిపారు. తొలి దశలో 100 శాతం ప్యూర్ ఇన్‌స్టంట్ కాఫీ రుచిని 50 గ్రాములు, 100 గ్రాముల టిన్స్ రూపంలో మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 20 వేల టిన్నుల్ని సిద్ధం చేశామని, గురువారం ఉదయానికి విశాఖ మార్కెట్లోకి ట్‌లోకి విడుదల చేయనున్నట్లు వివరించారు. 60-40 బ్లెండెడ్ కాఫీ, 2 గ్రాములు, 10 గ్రాముల సాచెట్స్ రూపంలో ఈ నెలఖారున గిరిజన శాఖమంత్రి పీడిక రాజన్నదొర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు లాభాల్ని అందించేలా జీసీసీ ప్రతి నిర్ణయం తీసుకుంటోందని గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి స్పష్టం చేశారు.